104

ధారావాహిక



# జాయ సేనాపతి

చారిత్రక కాల్పనిక నవల

మత్తి భానుమూర్తి ...
99893 71284

**జరిగిన కథ :** వెలనాడు మండలీశ్వరుడు, మహావీరుడు, కాకతీయ సామ్రాజ్య గజసాహిణి జాయచోడుడు స్వయంగా యుద్ధశంఖం పూరించాడని తెలుగు రాజ్యాలన్నిటా తెలిసిపోయింది. అద్దంకి మహారాజు చక్రనారాయణుడు, పాకనాడు మహారాజు సోమాండినాయడు కూడా కొంత చురుకయ్యారు. కానీ, మత విద్వేషంతో కళ్లు మూసుకుపోయిన ఆ మహారాజులు, ఆ రాజ్యాల ప్రజలు.. ఏమౌతుందో చూద్దామన్నట్లు యుద్ధప్రయత్నాలను విరమించలేదు. పైపెచ్చు ఉభయులకు మతాల సహకారం పుష్కలంగా ఉంది. వాళ్లు మరింత ద్వేషాన్ని ఎగదోస్తున్నారు.

ఈ సందర్భంలో అందరినీ తొలుస్తున్న ప్రశ్న ఒక్కటే!

వెలనాడు సైన్యం.. ముందు ఎవరిపైన యుద్ధం చేస్తుంది? యుద్ధ ఫలం ఏమిటి? గెలిచిన రాజ్యం కోరేది ఏమిటి? ఓడిన రాజ్యం ఏమి చెయ్యాలి??

వెలనాడు సందివిగ్రహి మాంకనభట్లు పూర్తిగా జాయ చమూపతి నీడలా ఉంటున్నాడు. ఆయన చెప్పింది తుచ తప్పకుండా రెండు శత్రురాజ్యాల సంధివిగ్రహీలకు తెలియజేస్తూ.. వారి మహారాజుల అభిప్రాయాలు తిరిగి జాయ చమూపతికి నివేదిస్తున్నాడు.

ఇప్పుడు తమ్ముణ్ని చూస్తే పృథ్వీశ్వరునికే బెదురు పుడుతున్నది. తమ్ముడు కోరిందల్లా లిప్తకాలంలోనే ఆజ్ఞలు జారీచేస్తూ పరుగులు పెడుతున్నాడు. ఇక ఇతర నియోగులు, సైన్యాధ్యక్షులు, వేగులు, వార్తాహరులు తిండీతిప్పలు మానేసి.. తమతమ నియోగాల యుద్ధసన్నాహాలలో ఊపిరి సలపకుండా ఉన్నారు. మంత్రులు, మహా సేనానులు, యుద్ధ మంత్రాంగ నిపుణులు ఎల్లప్పుడూ జాయ చమూపతి వెంటే ఉంటున్నారు.

ఓరోజు తెల్లవారకే ముందే మండలేశ్వరులు పిలుస్తున్నారు అనగానే ఉరుకులు పరుగులపై వచ్చిపడ్డాడు పృథ్వీ. అప్పటికే మంత్రాంగ నిపుణులతో తీవ్రాలోచనలో ఉన్న జాయపుడు అన్నను చూసి చెప్పాడు.

''అన్నా! జాపిలిసిద్ధి.. వాయువేగ మనోవేగంతో వచ్చి ఇక్కడ వాలాలి!''.

కంగారు పడిపోయాడు పృథ్వీ. తమ్ముడు చెప్పే ఆ జాపిలిసిద్ధి ఎవ్వరో తెలియదు. బాగా తెలిసినవాడు, మనకు బాగా కావాల్సినవాడు అన్నట్లు చెబుతున్నాడేమిటి!?

అన్న వెర్రిముఖం వేయడం జాయపుడు గుర్తించాడు.

''విక్రమ సింహపురం.. తిక్కభూపాలుడు.. మహాకవి తిక్కన మంత్రివర్యులు.. జాపిలిసిద్ధి..''

ఒక్కొకవ్యక్తిని గుర్తు చేస్తున్నట్లు జాయపుడు చెప్పడంతో ఆ సదరు జాపిలిసిద్ధి గుర్తొచ్చాడు పృథ్వీకి.

''ఆ.. గుర్తొచ్చాడు. నెల్లూరు పాలకుడు తిక్కకు జ్ఞాతి సోదరుడు. నీ స్నేహితుడు. గొప్ప యోధుడని నువ్వూ బావగారూ ఎప్పుడూ తలచుకుంటారు. కదూ!''.

''అద్గది. బాగా గుర్తు పెట్టుకున్నావ్ అన్నా. వాణ్ని నా మాటగా చెప్పి వెనువెంటనే రప్పించాలి..''

వేగంగా బయటికి పరుగుతీశాడు పృథ్వీ. అన్నట్లుగానే మరి మూడురోజుల్లో నెల్లూరు నుంచి వచ్చి జాయపుణ్ని గట్టిగా వాటేసుకున్నాడు జాపిలిసిద్ధి.